DD9 వార్త
తెలుగు దినపత్రిక
సోమవారం, అక్టోబర్ 13, 2025

## ఈ ఘనత ఆయిల్ ఫెడ్‌కే దక్కుతుంది

- నెరవేరిన మూడు లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యం
- ఓఈఆర్ రేట్ దేశంలోనే చారిత్రాత్మకం
- అప్పారావు పేట పామాయిల్ ఫ్యాక్టరీ అభినందనీయం
- అధికారులను ,సిబ్బంది నిసత్కరించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఆయిల్ ఫామ్ రైతుల ఆత్మీయ సమ్మేళనం

4 లో





# ములుగును ముంచేలా ఉన్నారు

## మంత్రుల మధ్య మేడారం ముసలం


- చెడ్డ పేరు తెస్తున్న టెండర్ల దుమారం
- జాతరను అడ్డుపెట్టుకొని కమిషన్ల రాజకీయం
- కాంగ్రెస్ పార్టీలో కాంట్రాక్టర్ రగడ
- ములుగును వెంటాడుతున్న పర్సంటేజ్ ల పాపం
- సమ్మక్క సారలమ్మల సాక్షిగా ఏదో ఒక ఆర్థిక వివాదం
- గత జాతర సమయంలోనూ ఉద్యోగులకు శఠగోపం
- భత్యాల చెల్లింపులో మొండిచేయి
- మంత్రుల వల్లే ప్రభుత్వానికి మచ్చ

2 లో

వచ్చే ఎన్నికల్లో గా ఒక్కో నియోజకవర్గాన్ని భ్రష్టు పట్టించే దిశగా సాక్షాత్తు మంత్రులే కంకణం కట్టుకున్నట్లుగా కనిపిస్తుంది. ప్రభుత్వ వైఫల్యాలను వెలుగులోకి తెచ్చే అవకాశాన్ని ప్రతిపక్షాలకు ఇవ్వడానికి ఇష్టపడని కాంగ్రెస్ మంత్రులు తమ ప్రభుత్వాన్ని బదనాం చేసుకునేందుకు వారే పోటీ పడుతున్నారు. కాంగ్రెస్ లో మంత్రుల మధ్య తలెత్తుతున్న రకరకాల వివాదాలు ప్రభుత్వానికి తలనొప్పిగా మారుతున్నప్పటికీ ఒకటి తర్వాత ఒకటిగా వివాదాలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి. ఎవరో ఒకరు ఏదో ఒక వివాదంలో భాగస్వామ్యం అవుతూ మళ్లీ ఆ వివాదాలను వాళ్లే స్వయంగా బయట పెట్టుకుంటూ ప్రతిపక్ష పార్టీలకు పని లేకుండా చేస్తున్నారు. తాజాగా మంత్రులు కొండా సురేఖ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిల మధ్య నెలకొన్న మేడారం టెండర్ల లొల్లి పవిత్రమైన సమ్మక్క సారలమ్మ జాతర విశిష్టతను విశ్వసనీతను దెబ్బతీసేలా చేస్తుంది. మేడారం జాతర సందర్భంగా కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో ఆయా పనులకు సంబంధించిన కాంట్రాక్ట్ వ్యవహారంలో మంత్రుల మధ్య తలెత్తిన పేఛీ వారి వ్యవహారాన్ని ప్రజలు ఛీఛీ అనేలా చేస్తుంది

డిడి9 వార్త, ములుగు

# ఖాకీల కలెక్షన్ల వేట





- బాధితులు ఏసీబీ బాట
- ప్రస్తుతం వారు ఎక్కడున్నారో తెలియదు

### అవినీతికి కేరాఫ్ అడ్రస్ మణుగూరు పోలీస్ స్టేషన్

- తారస్థాయిలో వసూళ్ల దందా
- ఇప్పటికే ఏసీబీకి చిక్కిన పోలీసులు
- అయినా మారని అక్రమార్కులు
- రక్షణ శాఖలో అవినీతి రాక్షసులు
- ప్రక్షాళన చేయకుంటే పరువు పోయే పరిస్థితులు

9 లో

## ఏసీబీ దృష్టిలో ఇద్దరు కానిస్టేబుళ్లు





రక్షణ శాఖలో అవినీతి రాజ్యమేలుతోంది. కొందరు పోలీసుల కలెక్షన్ల తంతు ఆ శాఖ పరువుకు భంగం కలిగేలా చేస్తుంది. భరోసానిచ్చే ఆ శాఖ ప్రజల్లో భయాన్ని నింపుతుంది. అడ్డదారి సంపాదన లక్ష్యంగా అనైతికదారుల్లో పయనిస్తున్న అవినీతి పోలీసుల వ్యవహారాలపై ప్రజల్లో నిరసన వ్యక్తం అవుతున్నాయి. క్రమశిక్షణ కలిగిన పోలీస్ శాఖలో అది లోపించేలా ప్రవర్తిస్తున్న వారి సంఖ్య పెరుగుతుండడంతో అవినీతి నిరోధక శాఖను ఆశ్రయిస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. కొందరు పోలీసుల తీరుతో విసిగిపోయిన పోలీస్ స్టేషన్ బాధితులు ఏసీబీ వైపు చూస్తున్నారు. నేరుగా పోలీసులపైనే ఫిర్యాదులు చేస్తూ తమ చైతన్యాన్ని చాటుతున్నారు ఈ పరిస్థితుల్లో పోలీసు ఉన్నతాధికారుల సైతం తమ శాఖలోని అవినీతి పనులను కాపాడుకునే ప్రయత్నాలు చేయకుండా అక్రమార్కులపై ఉక్కు పాదం మోపాల్సిన సమయం ఆసన్నమైంది లేదంటే అవినీతి పోలీసులు కారణంగా నిజాయితీపరుల పైన కూడా ప్రజల్లో చులకన భావన ఏర్పడే అవకాశం ఉంటుంది.

డిడి 9 వార్త బ్యూరో భద్రాద్రి కొత్తగూడెం

## ఇసుక లారీలు నిలిపివేయాలని సీతారాంపురంలో ఆందోళన

- అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా
- రోడ్డు మరమ్మత్తులు చెయ్యాలని డిమాండ్
- నిలిచిపోయిన వాహనాలు
- దారిపొడుగూత లారీలు
- గంటపాటు ట్రాఫిక్ జామ్

7 లో

## ముగిసిన వెంకటాపురం ప్రీమియర్ లీగ్ సీజన్ 2

- హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్
- విజయం సాధించిన హంటర్ లెవెన్ టీమ్
- రెండవ స్థానంలో మహాలక్ష్మి వారియర్స్ టీమ్

8 లో



# ములుగును ముంచేలా ఉన్నారు

- మంత్రుల మధ్య మేడారం ముసలం
- చెడ్డ పేరు తెస్తున్న టెండర్ల దుమారం
- జాతరను అడ్డుపెట్టుకొని కమిషన్ల రాజకీయం
- కాంగ్రెస్ పార్టీలో కాంట్రాక్టర్ రగడ
- ములుగును వెంటాడుతున్న పర్సంటేజ్ ల పాపం
- సమ్మక్క సారలమ్మల సాక్షిగా ఏదో ఒక ఆర్థిక వివాదం
- గత జాతర సమయంలోనూ ఉద్యోగులకు శఠగోపం
- భత్యాల చెల్లింపులో మొండిచేయి
- మంత్రుల వల్లే ప్రభుత్వానికి మచ్చ

**డి డి 9 వార్త ములుగు :** ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మేడారం జాతర విశ్వసనీయతను దెబ్బతీసే దిశగా సాగుతున్న అనైతికమైన వివాదాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి మైనస్ గా మారబోతున్నాయా..? కోట్లాదిమంది భక్తులు విచ్చేసే సమ్మక్క సారలమ్మ జాతరకు సంబంధించిన కోట్లాది రూపాయల అభివృద్ధి పనులకు సంబంధించి మంజూరు అయిన నిధుల వ్యవహారంలో తలెత్తుతున్న వివాదాలు ములుగు జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి ముప్పువాటిల్లే ప్రమాదాన్ని తెచ్చి పెడుతున్నాయా..? పలు ఆర్థికపరమైన వివాదాల్లో చిక్కుకుంటున్న మంత్రుల కారణంగా ప్రజల్లో నెలకొంటున్న నిరసనలు భవిష్యత్తులో ములుగు జిల్లాలో అధికార పార్టీకి తలనొప్పిని తెచ్చి పెట్టబోతున్నాయా .? అనే పలు ప్రశ్నలకు అవును అనే సమాధానమే వినిపిస్తుంది. వచ్చే ఏడాది అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగబోతున్న మేడారం జాతర ప్రపంచాన్ని తన వైపు తిప్పుకునేలా చేయబోతున్న తరుణంలో అదే జాతరకు సంబంధించిన "టెండర్ల వ్యవహారం" ప్రభుత్వంలోని ఇద్దరు ముఖ్యమైన మంత్రుల మధ్య పేచిని తెచ్చిపెట్టింది. దేవాదాయ శాఖ మంత్రి ప్రమేయం లేకుండా టెండర్ల ప్రక్రియలు నిధుల మంజూరు వ్యవహారాల్లో మరో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జోక్యం చేసుకుంటున్నారంటూ సంబంధిత మంత్రి కొండా సురేఖ చేసిన ఆరోపణలు కాంగ్రెస్ పార్టీలో "భస్మాసుర హస్తం" నానుడిని మరోసారి నిజం చేసేలా అనిపిస్తుంది. కోట్లాది రూపాయల జాతర పనులు జరుగుతున్న సందర్భంలో కాంట్రాక్టర్ల కక్కుర్తి వ్యవహారాలు సహజంగానే ఉంటాయి ఇది జగమెరిగిన సత్యం ఎవరు అవునన్నా కాదన్నా జరిగే వాస్తవం. అయితే అభివృద్ధి పనుల్లో జరిగే అక్రమాలను ప్రతిపక్షాలు మీడియానో బయట పెట్టడం ఆనవాయితీ సర్వసాధారణం. కాంగ్రెస్ ప్రభుత్వంలో భస్మాసుర హస్తం సిద్ధాంతాన్ని ఖచ్చితంగా అమలు చేసి పద్ధతి ఉండడంతో వారి లోపాలను వారే బయట పెట్టుకుంటారు . వారు చేసే తప్పులను వేరొకరు ఎత్తిచూపే లోపే వారే బయట పెట్టేస్తారు. ప్రస్తుతం మేడారం టెండర్లకు సంబంధించి జరిగిన వివాదాస్పద ప్రక్రియ అదే కోవలోకి వస్తుంది టెండర్ల వ్యవహారంలో జరిగిన బ్లండర్ మిస్టేక్స్ ను సాక్షాత్తు మంత్రి గళమెత్తి గర్జించడంతో ప్రభుత్వానికి తలనొప్పిగా మారింది. వివాదాలకు కేరాఫ్ అడ్రస్ గా పేరుపొందిన మంత్రి సురేఖ మరోసారి మంత్రుల మధ్య తలెత్తిన వివాదాన్ని డప్పు వేసి మరి చాటారు. దీంతో మేడారం వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది.

## ఆర్థిక కోణం.. వాదాల్లో మేడారం

మేడారం అంటేనే మహా జాతర. అమ్మవార్ల మొక్కులు తీర్చుకునేందుకు ప్రపంచంలోని నలుదిక్కుల నుండి భక్తులు వస్తూ ఉంటారు. ఏడాది ముందుగానే జాతరకు సంబంధించిన కార్యాచరణ నడుస్తూ వస్తుంది కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టేస్తారు ఈ క్రమంలోనే మేడారంలో జరిగే ప్రతి అభివృద్ధి పనిపై సౌకర్యాలు కల్పనపై భక్తులు ఆరాతీస్తూ ఉంటారు ప్రతి తప్పును నిశితంగా పరిశీలించే పరిస్థితులు నెలకొంటాయి.. అలాంటప్పుడు అలాంటి విశ్వసనీయతతో కూడిన జాతరను లోపాలు వివాదాలకు దూరంగా నిర్వహించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై సంబంధిత మంత్రులపై ఉంటుంది. అభివృద్ధిలో అక్రమాలు చోటు చేసుకున్న లోపాలు తలెత్తిన తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత మంత్రులే టెండర్లకు సంబంధించిన వివాదాల్లో భాగస్వామ్యం కావడమే కాకుండా ఆ వివాదాలను ప్రపంచానికి తెలిసేలా చాటడం విశేషం. ఈ తరహా వివాదాల వల్ల మేడారం అభివృద్ధి విషయంలో కమిషన్లు కాంట్రాక్టు అంశాలే వెలుగులోకి వచ్చి ప్రచారానికి నోచుకుంటాయి దీనివల్ల మేడారం విశిష్టత దెబ్బ తినడమే కాకుండా ప్రభుత్వం సైతం ఇరుకున పడుతుంది . ఇది భవిష్యత్ రాజకీయాలకు నష్టదాయకం అనేది అధికార పార్టీలో సైతం చర్చలకు దారితీస్తుంది. గతంలో జాతర సంబంధించి కూడా అనేక ఆరోపణలు ఉన్నాయి. గత జాతరలో విధులు నిర్వహించిన వందలాది మంది ఉద్యోగులకు సంబంధించిన టి ఏ,డి ఏ ల పంపిణీల ప్రక్రియలో సైతం అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపణలు ఉన్నాయి ఉద్యోగులకు టీఏడీఏలు అందలేదని విమర్శలు వినిపిస్తున్నాయి కోటల్లో నిధులు పక్కదారి పట్టాయంటూ ఇటీవల సోషల్ మీడియాలో సైతం ప్రచారం జరిగింది ఓ ఉన్నతాధికారిపై విమర్శలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ సైతం పెట్టారు. ఇలా ములుగు జిల్లాలో జాతరైన ప్రతిసారి అభివృద్ధి నిధుల వినియోగంపై విమర్శలు వస్తూనే ఉన్నాయి కానీ ఈసారి ఏకంగా మంత్రులే వివాదాలకు సూత్రధారులుగా ఉండడం విశేషం




## ములుగును ముంచేసాలా ఉన్నారు

జన సంద్రాన్ని తలపించే రీతిలో జరిగే మేడారం జాతరలో తాజాగా తలెత్తిన ముసలం నేపథ్యంలో ములుగు జిల్లా వార్తల్లోకెక్కింది. ఇప్పటికే ములుగు జిల్లాలో రకరకాల మాఫియా పోకడల కారణంగా ప్రజల్లో నిరసన వ్యక్తం అవుతున్నాయి ఇదే సమయంలో మేడారం జాతరకు సంబంధించిన కోట్ల రూపాయల అభివృద్ధి పనుల టెండర్లకు సంబంధించి మంత్రుల మధ్య పేఛీలు రావడం జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి ఖ చ్చితంగా నష్టదాయకమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రపంచమంతా చూసే ములు గు జిల్లాలోని మేడారం జాతర సంబం ధించి నెలకొన్న అభివృద్ధి నిధులు కాంట్రాక్టుల కల్లోలం వ్యవహారం ప్రత్యర్థులకు అవకాశం ఇచ్చినట్లుగా అవుతుందని కాంగ్రెస్ అభిమానులు అంటున్నా రు. మంత్రి స్థాయిలో ఉండి ఇంటిగుట్టును వీధుల్లోకి తెచ్చి పార్టీ పరువును బ్రష్టు పట్టిస్తున్నారు అంటూ విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల హడావుడి నేపథ్యంలో ఇప్పటికే ములుగు జిల్లాలో రాజకీయం వేడి వాడిగా ఉంది బి ఆర్ఎస్ పార్టీ జడ్పీపీఠంపై కన్నేసి ఆ దిశగా చాప కింద నీరులా పావులు కదుపుతున్న నేపథ్యంలో ములుగు జిల్లాలో జరుగుతున్న ప్రతిష్టాత్మకమైన మేడారం జాతర వ్యవహారంలో చోటు చేసుకున్న టెండర్ల లొల్లి దాన్ని బయట పెట్టేసుకున్న మంత్రుల వ్యవహారాలు గులాబీ పార్టీకి ప్రచార అస్త్రంగా ఉపయోగపడే అవకాశాలు ఉన్నాయి. మేడారం కు సంబంధించిన ఏ చిన్న వివాదం తలెత్తిన లక్షల్లో జనం దృష్టికి తిట్టే వెళ్లిపోతుంది ఈ క్రమంలో ములుగు ప్రజల దృష్టి ఈ వివాదంపై పూర్తిస్థాయిలో పడే అవకాశం ఉంది దీనివల్ల రాబోయే రోజుల్లో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు భవిష్యత్తు ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీకి ఇది మాయని మచ్చ గాని మిగిలిపోద్ది అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇదంతా సత్యమే అయినప్పటికీ దీన్ని కూడా జీర్ణించుకోలేని కాంగ్రెస్ పెద్దలు ములుగు జిల్లాలో ఉన్నారు. జరిగిన తప్పుని సరిదిద్దుకొనే ప్రయత్నాలు వారిలో ఉండవు.. పైగా ఇలాంటి కథనాలపై ఆ పెద్దలు అక్కసు సైతం వెళ్లగక్కుతారు భుజాలు కూడా తడుముకుంటారు






# కాలేశ్వరం వద్ద భారీ గా తగ్గిన గోదావరి నది.... పేరుకుపోయిన చెత్తాచెదారం

- **తొలగించాలని కోరుతున్న భక్తులు**

**కాటారం (డి డి 9 వార్త )**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద గోదావరి నది భారీగా తగ్గింది .. దీంతో పుష్కర ఘాటు పైన చెత్తాచెదారం పేరుకుపోయింది . పుష్కర్ ఘాట్ వద్ద గత రెండు నెలల నుండి పూర్తిగా మునిగి ఉన్న పుష్కర ఘాట్ ఆదివారం ఉదయం నుండి తగ్గుతూ వచ్చింది . దీంతో పుష్కర ఘాటు వద్ద గోదావరిలో స్నానం చేసిన భక్తులు కొబ్బరికాయలు, బట్టలు, ఆస్థికల కుండలు నదిలో వేయడంతో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయి కనిపిస్తుంది. దీంతో స్నానాలకు వచ్చిన భక్తులు నీటిలో దిగడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు . ఇప్పటికైనా ఆలయం అధికారులు, గ్రామపంచాయతీ అధికారులు గోదావరి తీరంలో ఉన్న చెత్తాచెదరంను తొలగించాలని భక్తులు కోరుతున్నారు . గోదావరి తీరం వద్ద నిత్యం చెత్త తీయడం కోసం సిబ్బందిని నియమించాలని భక్తులు కోరుతున్నారు.

# వైద్య శిభిరం విజయవంతం

**భూపాలపల్లి అక్టోబర్ 12 (డిడి 9వార్త)**

భూపాలపల్లి రూరల్ గొర్లవీడు లో స్టార్ హాస్పిటల్, తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం నాడు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. వైద్యులు గ్రామంలోని ప్రజలను పరీక్షించి వారి ఆరోగ్య పరిస్థితిని బట్టి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించడం అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. మమ్మల్ని సంప్రదిస్తే మరో గ్రామంలో కూడా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని వారు తెలిపారు. అనంతరం తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా నాయకుడు రవి పటేల్ మాట్లాడుతూ స్టార్ హాస్పిటల్స్ వారు చేస్తున్న ఈ మంచి పనిలో మేము కూడా భాగస్వామ్యం అయినందుకు సంతోషంగా ఉందని మా పార్టీ ఎజెండాలో వైద్యం అనే అంశం నిరుపేద మధ్యతరగతి కుటుంబాలకు తోడ్పాటు అందిస్తుందని ప్రజలకు మరింత చేరువ కావడం ప్రజలలో మమేకమై వారి సమస్యలు ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవడం మా బాధ్యతగా భావించి ఈ యొక్క మంచి కార్యక్రమంలో మమ్మల్ని భాగస్వాములు చేసినందుకు సహకరించినందుకు గ్రామ ప్రజలకు స్టార్ హాస్పటల్ వారికి కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో సమ్మయ్య వంశీ సురేందర్ సలీం పాషా అనిల్ చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## గిరిజన దర్బార్ కు అధికారులు సకాలంలో హాజరుకావాలి

- **ఐటీడీఏ అధికారులకు పీవో ఆదేశం**

**భద్రాచలం అక్టోబర్ 12 డిడి9 వార్త**



భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నాడు నిర్వహించనున్న గిరిజన దర్బార్ కార్యక్రమానికి అన్ని శాఖల ఐటీడీఏ యూనిట్ అధికారులు సకాలంలో హాజరుకావాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

గిరిజనులు వారి వారి సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదును అందజేయాలని ఆయన కోరారు. సంబంధిత యూనిట్ అధికారులు ఉదయం 10.30 గంటలకు ఐటీడీఏ సమావేశ మందిరంలో తప్పనిసరిగా హాజరు కావాలని పీవో బి. రాహుల్ స్పష్టం చేశారు. గిరిజనుల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు సంసిద్ధంగా ఉండాలని ఆయన ఆదేశించారు.



# ఈ ఘనత ఆయిల్ ఫెడ్ కే దక్కుతుంది

- నెరవేరిన మూడు లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యం.
- ఓఈఆర్ రేట్ దేశంలోనే చారిత్రాత్మకం.
- అప్పారావు పేట పామాయిల్ ఫ్యాక్టరీ అభినందనీయం.
- అధికారులను ,సిబ్బందిని సత్కరించిన మంత్రి తుమ్మల .
- ఆయిల్ ఫామ్ రైతుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఎమ్మెల్యే జారె , ఆయిల్ ఫెడ్ చైర్మన్ రాఘవరెడ్డి ,కలక్టర్ జితేష్ .వి.పాటిల్.
- ఆదర్శ రైతులకు ప్రోత్సాహకాలు .

**దమ్మపేట ,అక్టోబర్ 12 డిడి9 వార్త :**

ఆయిల్ ఫెడ్ చరిత్రలోనే సుస్థిరమైన స్థానం సంపాదించిన అప్పారావు పేట పామాయిల్ ఫ్యాక్టరీ అధికారులను ,సిబ్బందిని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి తో కలిసి అశ్వారావుపేట శాసన సభ్యులు జారె ఆదినారాయణ , జిల్లా కలక్టర్ జితేష్. వి.పాటిల్ ఆదివారం మండలంలోని అప్పారావు పేట పామాయిల్ ఫ్యాక్టరీ ఆవరణలో ఏర్పాటు చేసిన ఆయిల్ ఫామ్ రైతుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా దశాబ్ధి కాలంలో మూడు లక్షల మెట్రిక్ టన్నుల పామాయిల్ ఫ్రూట్ ను దిగుమతి చేసుకొని లక్ష్యం పూర్తి చేసిన సందర్భంగా రాష్ట్ర మంత్రి చేత భారీ కేక్ కటింగ్ చేయించారు. అనంతరం వివిద ప్రాంతాలనుండి వచ్చిన పామాయిల్ రైతులతో వారి వారి అనుభవాలను పంచుకున్నారు. వారిలో డివిజనల్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి సూచించిన రైతులను ఎవరైతే ఎకరాకు అత్యధిక టన్నుల పామాయిల్ ఫ్రూట్స్ ను దిగుమతి చేస్తున్నారో ఆ రైతులను గుర్తించి వారికి సభావేదికపై సన్మానం గావించారు. ఆంధ్రా ,ఇతర జిల్లా ల నుండి పామాయిల్ రైతాంగం అధిక సంఖ్యలో హాజరయ్యారు.

**ములకలపల్లిలో మరొక ఫ్యాక్టరీకి సిగ్నల్ : తుమ్మల.**

10వేల ఎకరాల్లో పామాయిల్ సాగు దాటితే ములకలపల్లిలో మరో ఫ్యాక్టరీ కి అనుమతి ఇస్తాం అంటూ మంత్రి తుమ్మల ప్రసంగించారు. ఇంపోర్ట్స్ డ్యూటీ పెంచాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామన్నారు. దాని వలన ఇతర దేశ పంటల ఉత్పత్తుల పై ఆధారపడాల్సిన అవసరం లేదన్నారు. ఇప్పటికే మామిడి ,జీడిమామిడి రైతులు పామాయిల్ సాగు వైపు దృష్టి సారిస్తున్నారని తెలిపారు.

పామాయిల్ సాగుతో పాటుగా అంతర్ పంటలను కూడా ప్రోత్సహించాలని రైతులకు సూచించారు. మొక్క దశలో ఉన్నప్పుడే బలంగా పెంచాలని ,అందుకోసం సేంద్రియ పద్దతినే ఎంచుకోవడం అవసరమన్నారు. నేటి రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా పామాయిల్ సాగు ఒక్కటే నంబర్ వన్ గా నిలిచిందని , దేశంలోనే త్వరలో అత్యున్నత స్థానంలో పామాయిల్ రైతాంగం నిలబడాలని ఆకాంక్షించారు. అతి తక్కువ కాలంలోనే దశాబ్ది కాలంలో అనుకున్న లక్ష్యం మూడు లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి సాదించడం పట్ల ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ మేనేజర్ కళ్యాణ్ తో సహా అధికారులను ,సిబ్బందిని అభినందించారు.అప్పారావు పేట ,అశ్వారావుపేట లలో కాలష్య నియంత్రణ కోసం ఫ్యాక్టరీ నిబంధనల మేరకు అభివృద్ధి చేయాలని మంత్రి ఆదేశించారు.



**ఫ్యాక్టరీ లో మెకానికల్ ఇంజనీర్లను అపాయింట్ చేయండి :- మంత్రి.**

ఫ్యాక్టరీలో అత్యధిక పనిభారం పెరిగిందని ,ప్రస్తుతం ఉన్న టెక్నీషియన్ లకు ఉద్యోగ ఉన్నతులు కల్పించాలని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్తీక్ మంత్రిని కోరడంతో , స్పందించిన మంత్రి మెకానికల్ విభాగంలో అర్హులైన వారి నుండి ధరఖాస్తులు స్వీకరించి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని చైర్మన్ రాఘవరెడ్డి ని ఆదేశించారు.

**రైతులకు తలమానికంగా పామాయిల్ సాగు. : ఎమ్మెల్యే.**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నేపామాయిల్ సాగు రైతులకు ఒక వరంగా నేడు సాగులో ఉందని , తలమానికంగా మారిందని అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ పేర్కొన్నారు.

మంత్రి తుమ్మల ఈ ప్రాంతంలో పామాయిల్ సాగు విస్తరణకు విశేషంగా కృషి చేస్తున్నారంటూ ప్రశంసించారు.

తాను మొదటిసారిగా పామాయిల్ పంట డబ్బుతో కార్ కిస్తీ చెల్లించానంటూ నాటి ఆర్థిక ఒడిదుడుకులు గురించి కళ్ళు చెమర్చేవిదంగా ప్రసంగించారు.

ఫ్యాక్టరీ నిర్మాణ నిబంధనలకు అనుగుణంగా పరిసర ప్రాంతాలలో కాలుష్య నివారణకు చేపట్టాల్సిన కార్యక్రమాలు అమలు చేయాలని మంత్రి ని కోరారు. అశ్వారావుపేట ,దమ్మపేట మండలాల్లో హార్టికల్చర్ హబ్ ను ఏర్పాటు చేయాలని ,ములకలపల్లిలో మరొక ఫ్యాక్టరీ కి అనుమతులు ఇవ్వాలని వ్యవసాయ మంత్రిని కోరారు.

**ఆహారపంటలపై కూడా దృష్టి పెట్టండి.: కలక్టర్ పాటిల్.**

పామాయిల్ సాగు విస్తీర్ణం పెంచుకుంటూనే ఆహార పంటలపై కూడా రైతులు దృష్టి సారించాలని కలక్టర్ జితేష్ .వి. పాటిల్ రైతులకు సూచించారు. ప్రత్తి ,మినప ,మిర్చి ,మొక్కజొన్న పంటలను కూడా ప్రోత్సహించాలని కోరారు. అలాగే ఉపాది హామీ వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఉపయోగించుకొని మేకల పెంపకం ,పుట్టగొడుగుల సాగు , ములగసాగు ,కోళ్ళఫారాలు,పుట్టతేనె పెంపకాలు, కౌజు పిట్టల ఫామ్స్ వంటివి ప్రోత్సహించాలని రైతులను కోరారు.





వెదురు సాగు వలన ఆర్థిక లాభాలు ఉన్నాయని ,అందుకోసం అటవీశాఖ అనుమతులు ఇస్తుందన్నారు. ఈ తరహా సాగులో ములకలపల్లి మండలం ముందంజలో ఉందన్నారు.

కార్యక్రమంలో రాష్ట్ర పామాయిల్ సంఘం అద్యక్షులు ఆలపాటి రామచంద్ర ప్రసాద్ , ఎయంసి చైర్మన్ వాసం రాణీ శ్రీనివాస్ , సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొయ్యల అచ్యుత రావు , మాజీ జడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు , మొగళ్ళపు చెన్నకేశవరావు , జేష్ట సత్యనారాయణ చౌదరి ,పామాయిల్ రైతులు , కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**యాట్ల వెంకమ్మ. పామాయిల్ రైతు ,లచ్చాపురం.**

వాయిస్ : 'నేను 5 ఎకరాల పామాయిల్ సాగు చేస్తున్నాను. 13 సం.రాల ముదురు తోట. దానిలో నేను జీవామృతం ,ఆవు మూత్రం వంటి సేంద్రియ ఎరువులు వాడుతూ సాగు చేశాను. నేడు ఎకరానికి 14టన్నుల వరకు ఫ్రూట్ దిగుబడి సాదించడం పట్ల ఆనందంగా ఉంది. మంత్రి చేతులతో సన్మానం పొందడం సంతోషాన్ని ఇచ్చింది.




## టపాసుల దుకాణదారులు పోలీస్ అధికారుల అనుమతి తీసుకోవాలి: ఎస్పీ రోహిత్ రాజు

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, అక్టోబర్ 13, (డిడి9 వార్త)**

దీపావళి పండుగ సందర్బంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలో తాత్కాలిక టపాకాయల దుకాణాలు నెలకొల్పేవారు సంబంధిత డివిజినల్ పోలీస్ అధికారి కార్యాలయం నుండి ధరఖాస్తు చేసుకొని అనుమతి పొందాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఒక ప్రకటనలో వెల్లడించారు. దానికి సంబంధించిన ఇతర సమాచారం కోసం సంబంధిత డివిజినల్ స్థాయి పోలీస్ అధికారులను సంప్రదించాలని తెలిపారు. ఎవరయినా సంబంధిత డివిజినల్ పోలీస్ అధికారి నుండి అనుమతి లేకుండా టపాకాయల దుకాణాలను నెలకొల్పినట్లయితే వారిపై ఎక్స్ ప్లోజివ్ యాక్టు 1884 రూల్స్ 1933 సవరణ 2008 ప్రకారంగా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. టపాకాయల దుకాణదారులు తప్పక ఈ క్రింది నిబంధనలు పాటించాలని, టపాకాయల దుకాణాలు సంబందిత నిర్ణయించిన ఖాళీ ప్రదేశాలలో నెలకొల్పవలెను. ఖాళీ ప్రదేశానికి సంబంధించిన నో అబ్జెక్షన్ సర్టిఫికేటు పొందుపర్చాలన్నారు. జనావాస ప్రదేశాలలో ఎలాంటి టపాకాయల షాపుల ఏర్పాటు చేయరాదని , అదేవిధంగా కళ్యాణ మండపాలలో మరియు సమావేశాల కేంద్రాలలో టపాకాయల దుకాణాలు నెలకొల్పరాదని పేర్కొన్నారు. తాత్కాలిక టపాకాయల దుకాణాల వద్ద అగ్ని ప్రమాదాలు సంభవించకుండా దుకాణదారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని , సంభంధిత అన్ని శాఖల నుండి అనుమతి పత్రాలను పొందిన తర్వాతనే దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని, అదేవిధంగా సమీపంలో ఇసుక తగినంత నీటిని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

## ఆన్‌లైన్ గేమ్స్ మాయ..!

- **జూదానికి బలైపోతున్న యువత..**
- **అప్పులు చేసి మరి గేమ్స్ ఆడుతున్నారు..!**

**మంగపేట, అక్టోబర్ 12 )డిడి9 వార్త)**

ఆన్‌లైన్ గేమ్స్ పేరుతో జూదం రూపం దాల్చిన ఆటలు యువత జీవితాలను మింగేస్తున్నాయి. స్మార్ట్‌ఫోన్‌లో ప్రారంభమైన సరదా ఇప్పుడు అప్పుల బరువుగా మారుతోంది. ఒక్కోసారి గెలిచే తీపి ఆశతో, మరోసారి పోయిన నష్టాన్ని తిప్పి తెచ్చుకోవాలనే తపనతో యువకులు బోల్తా పడుతున్నారు. వచ్చేవారికి వస్తున్నాయి, పోయేవారికి పోతున్నాయి.. అన్న సామెత నిజమవుతుందన్నట్లు పరిస్థితి తయారైంది. డబ్బు గెలుస్తామనే ఆశతో కొందరు క్రెడిట్ కార్డులు వాడుతూ, యాప్ ల లోన్ సదుపాయాలను వినియోగించి మరీ ఆడుతున్నారు. చివరికి అప్పులు, కుటుంబ కలహాలు, నిరాశే మిగిలిపోతున్నాయి.

ఇక దీనిలో మరో ప్రమాదం సైబర్ నేరగాళ్లు. గేమ్ యాప్‌ల రూపంలో మోసగాళ్లు యువత డేటా, బ్యాంక్ వివరాలు దోచుకుంటున్నారు. చిన్న గేమ్ ఆడతామనుకున్న వారు ఆన్‌లైన్ మోసాలకు బలైపోతున్నారు. సామాజిక వేత్తలు హెచ్చరిస్తున్నారూ. “ఇది కేవలం గేమ్ కాదు, జూదపు బాటలోకి తీసుకెళ్లే ఉచ్చు. వెంటనే ఆగాలి, లేకపోతే జీవితమే గేమ్ ఓవర్ అవుతుంది” అని.



# భద్రాద్రి రామయ్య అన్నదానానికి లక్ష విరాళం

- **హైదరాబాద్ దంపతుల దాతృత్వం**

**భద్రాచలం, అక్టోబర్ 12 (డీడీ9 వార్త):**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయ నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన దంపతులు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు.

హైదరాబాద్‌లోని మలక్‌పేటకు చెందిన లింగం శ్రీకాంత్, లక్ష్మి భవాని దంపతులు శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయ ఉచిత అన్నదాన నిమిత్తం రూ. 1,00,116/ (రూపాయిలు లక్షా నూట పదహార్లు) విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దంపతులు స్వామి వారిని దర్శించుకుని, ఆలయ అధికారులకు విరాళానికి సంబంధించిన చెక్కును అందజేశారు. వారి దాతృత్వాన్ని ఆలయ అధికారులు అభినందించారు. స్వామి వారి నిత్యాన్నదాన పథకంలో భక్తులు పాలుపంచుకోవడం సంతోషకరమని పేర్కొన్నారు.



# రేపు ప్రజావాణి కార్యక్రమం రద్దు

- **మేడారంలో పర్యటన చేయనున్న రాష్ట్ర రెవెన్యూ,హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క**

**మంగపేట, అక్టోబర్ 12(డిడి9 వార్త)**

ములుగు జిల్లా కలెక్టరేట్ లో సోమవారం (13/10/2025) రోజున నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.సోమవారం రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ఎస్ఎస్ తాడ్వాయి మండలం లోని మేడారంలో సమ్మక్క సారలమ్మ మహా జాతర 2026 ఏర్పాట్ల పై ఉన్నత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిం చనున్నందున ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఆ యన పేర్కొన్నారు. వచ్చే సోమవారం యథావిధిగా జిల్లా కలెక్టరేట్ లో ప్రజా వాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఆ ప్రకటనలో వెల్లడించారు.



## కమలాపూర్ పేపర్ మిల్లును టేకోవర్ చేసిన వి యస్ టి జాడెక్కడ

- **ఏఐటియుసి జిల్లా ప్రధానకార్యదర్శి జంపాల రవీందర్**

**మంగపేట, అక్టోబర్12(డిడి9వార్త)**

మండలంలోని కమలాపురం గ్రామంలో ఏఐటియుసి మండల మహసభ గడ్డం భారతి అధ్యక్షతన రావి నారాయణరెడ్డి భవణములో ఏర్పాటు చేయగా ముఖ్య అతిధిగా హజరైన ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ ఏఐటియుసి జెండాను ఎగురవేసి అనంతరం మాట్లాడుతూ వరంగల్ ఉమ్మడి జిల్లాలోని మంగపేట మండలంలో గల ఏకైక పరిశ్రమ(బిజిపిపియల్) మూతపడి పదమూడు సంవత్సరాలు దాటినా పునరుద్ధరిస్తామని హామీలు ఇచ్చిన మంత్రులు పార్లమెంట్ సభ్యులుకేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన జిల్లా మండల నాయకులు ఏం చేస్తున్నారు, ఎప్పుడు పునరుద్దిస్తారు అని ప్రశ్నించారు పాత కంపెనీని టేకోవర్ చేసిన వి యస్ టి యాజమాన్యం ఎక్కడా అని నిలదీసారు కనుక ఈ ప్రాంతంలోని ప్రజలు ప్రజా ప్రతినిధులు రాజకియ పార్టీలు పోరాడి సాదించుకోవాలని పిలుపునిచ్చారు దానితో పాటు దానిమీద ఆధారపడి అనేక బకాయిలు రావలసిన కార్మికుల బకాయిలు టేకోవర్ చేసిన యాజమాన్యం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు మధ్యాహ్న భోజన వంట కార్మికులకు కేంద్ర ప్రభుత్వం కేవలం 600 రూపాయలు మాత్రమె చెల్లస్తూ శ్రమ దోపిడీ చేస్తుంది అన్నారు స్కీం వర్కర్స్ అందరినీ రెగ్యులరైజ్ చేయాలని కార్మిక వర్గానికి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు హమాలీ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టం అమలు చేయాలని భవణ నిర్మాణ సంక్షేమ బోర్డు ప్రభుత్వం ఆధీనంలోనే నిర్వహించాలని సంక్షేమ బోర్డు నిధులను మెడికల్ టెస్టుల పేరుతోని దుర్వినియోగం చేయడం మానుకొని సభ్యులకు సంక్షేమ నిధులు పెంచాలని డిమాండ్ చేశారు ఈ సమావేశంలో బండి జయమ్మ మధ్ధి భోయున భారతి యస్ కే షపియా గడ్డం భారతి ఆలం హేమ ఈసాల రమాదేవి బల్లెం రాములు కొడాలి తులసి కె శ్రీదేవి వాసం నాగేంద్ర తాలూక వెంకటనర్సమ్మ విజయలక్ష్మి కోరం పద్మ అమీన పాగ పద్మ ఖైరున్ బుచ్చమ్మ అఖిల శ్రీలత పాల్గొన్నారు.







# మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన రాష్ట్ర మంత్రి వర్యులు సీతక్క

**తాడ్వాయి (డీడీ 9 వార్త అక్టోబర్ 12):-**

ఊరట్టం గ్రామపంచాయితీ పరిధిలోని కొత్తూరు గ్రామానికి చెందిన వాణిజ్య వ్యాపారవేత్త, రైస్ మిల్ ఓనర్ కదారి సమ్మిరెడ్డి, మల్లారెడ్డి, గార్ల తండ్రీ కదారి వెంకట్ రెడ్డి గారు ఇటీవల అనారోగ్యం కారణంగా మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపిన రాష్ట్ర మంత్రి వర్యులు సీతక్క. ఈ కార్యక్రమంలో తాడ్వాయి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొల్లు దేవేందర్ ముదిరాజ్, మేడారం ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఆరెం లచ్చు పటేల్, గౌరవ మండల అధ్యక్షులు జాలపు అనంత రెడ్డి, మాజీ ఎంపీటీసీ బత్తిని రాజు, తాడ్వాయి మాజీ సర్పంచ్ ఇర్ప సునీల్ దొర, ములుగు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ జాలిగపు జంపన్న, తాడ్వాయి మండల సోషల్ మీడియా కో ఆర్డినేటర్ గజ్జల రాజశేఖర్ నాయకులు పాల్గొన్నారు.

# పాండవుల గుట్టలో హెరిటేజ్ వాలంటీర్స్

**భూపాలపల్లి అక్టోబర్ 12 (డిడి 9 వార్త)**

వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్స్ క్యాంప్ 2025 లో భాగంగా జిల్లాలోని పాండవుల గుట్టలను పలు విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు సందర్శించారు. పది రోజుల పాటు హెరిటేజ్ వాలంటీర్ క్యాంప్ 2025ను కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ప్రొఫెసర్ పాండురంగారావు,శ్రీధర్ రావు లు నిర్వహిస్తున్నారు. పర్యాటకశాఖ తెలంగాణ ప్రభుత్వం సహకారంతో నిర్వహిస్తున్న ఈ క్యాంపు లో శిక్షణలో భాగంగా 5వ రోజు పాండవుల గుహలను సందర్శించగా వీరికి ఉమ్మడి వరంగల్ జిల్లా అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ డాక్టర్ కుసుమ సూర్య కిరణ్ పాండవుల గుహల చరిత్రను వాటి ప్రాముఖ్యతను వివరించారు. క్యాంప్ కోఆర్డినేటర్ గా శ్రీధర్ రావు వ్యవహరిస్తున్నారు పాండవుల గుహల ను స్థానికుడు రావుల తిరుపతి తో పాండవుల గుహల లోని అన్ని ప్రదేశాలను తిలకించారు ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ పాండు రంగారావు శ్రీధర్ రావు శ్రీనివాస్ డాక్టర్ కృష్ణ సూర్య కిరణ్, అటవీ శాఖ సిబ్బంది శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు



# సేవల్లో ఫస్ట్ ఎన్ఆర్ఐ డాక్టర్స్

- **లండన్ లో ఉన్నా మనసంతా మాతృభూమిపైనే**
- **వనవాసికి ఆర్వో వాటర్ ప్యూరిఫైయర్ అందజేత**
- **సేవా భావానికి హట్సాఫ్ బివిఎస్ఎల్ నరసింహారావు**

**చర్ల, అక్టోబర్ 12 ( డిడి 9 వార్త )**



మాతృ భూమిపై మమకారంతో తన దాతృత్వం చాటుకున్నారు ఎన్ ఆర్ ఐ దంపతులు. తాము ఎంతో దూరంలో ఉన్నా, తీరికలేని జీవనం సాగిస్తున్నా వారి మనసు ఎప్పుడూ చర్లపైనే ఉంటుంది. జన్మభూమిని వీడి మూడు దశాబ్దాలు దాటినా వారికి మమకారం తగ్గలేదు. అవసరం వచ్చినప్పుడల్లా నేనున్నానంటూ ఇక్కడి వారికి కావాల్సిన ఆర్థిక సహాయం అందించి తమ సేవాభావం చాటుకుంటున్నారు డాక్టర్ పసుపులేటి రామకృష్ణ డాక్టర్ మిత్రవింద దంపతులు. ఆదివారం డాక్టర్ రామకృష్ణ మాతృమూర్తి సూర్యకాతం వర్ధంతి సందర్భంగా చర్లలోని వనవాసీ కళ్యాణ పరిషత్ కొమరం భీం విద్యార్థి నిలయంకు ఆర్వో వాటర్ ప్యూరిఫైయర్ ను అందచేసారు. ఈ సందర్భంగా ఆదివారం విద్యార్ధి నిలయంలో జరిగిన కార్యక్రమంలో వనవాసీ గౌరవ సలహాదారులు బివిఎస్ఎల్ నరసింహారావు మాట్లాడుతూ రామకృష్ణ మిత్రవింద, వారి కుమారులు భువన్ కృష్ణ, నిర్మల్ కృష్ణ లు గత ఏడాది సైతం విద్యార్థులకు నెల రోజులకు సరిపడా కిరణా సామాన్లను అందచేసిన విషయాన్ని గుర్తుచేసారు. ఈ ఏడాది కూడా గుర్తుంచుకొని తన మాతృమూర్తి జ్ఞాపకార్థం ఆర్వో వాటర్ ప్యూరిఫైయర్ అందించడం అభినందనీయమని అన్నారు. వాతావరణ పరిస్దితుల కారణంగా గత ఆగస్టులో పలువురు విద్యార్థులు అనారోగ్యం బారిన పడ్డారని, ఆనారోగ్య సమస్యకు త్రాగునీరు కూడా ఒక కారణమని గుర్తించిన రామకృష్ణ విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు స్వచ్ఛమైన నీరు అందించాలనే లక్ష్యంతో వాటర్ ప్యూరిఫైయర్ అందించారన్నారు. రామకృష్ణ తండ్రి కొండలరావు చర్లలో అనేక సంవత్సరాల పాటు జిజిసి సేల్స్ మెన్ గా అంకితభావంతో విదులు నిర్వహించి తన సేవలను అందచేసారని గుర్తుచేసారు. తండ్రి నుంచి అందిపుచ్చుకున్న అంకిత భావాన్ని కుమారుడు పునికిపుచ్చుకొని సేవా గుణంతో ముందుకు సాగడం సంతోషకరమని పేర్కొన్నారు. ఇటువంటి వారిని ఆదర్శంగా తీసుకొని మరింత మంది దాతలు ముందుకు వచ్చి పేద విద్యార్థుల చదువులకు సహకరించాలని పిలుపునిచ్చారు. పేద విద్యార్థులకు చదువులో వెన్నుదన్నుగా నిలిచి వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దడంలో సహకరించాలని విజ్ఞప్తి చేసారు. ప్రతివ్యక్తి తన సంపాదనలో కొంత మొత్తాన్ని సేవా కార్యక్రమాలను వినియోగించాలని కోరారు. విద్యార్థులు సైతం దాతలు అందచేస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉద్బోదించారు. క్రమశిక్షణతో చదివితే భవిష్యత్ బంగారుమయంగా ఉంటుందన్న విషయాన్ని గుర్తెరగాలన్నారు. చదువుకునే సమయంలో సుఖపడితే ఆ తర్వాత జీవితాంతం కష్టపడతారని, అదే చదుకునే వయసులో కష్టపడిడే జీవితాంతం సుఖపడతారనే విషయాన్ని ప్రతి విద్యార్థి గమనించాలన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు భోదించే పాఠ్యాంశాలను శ్రద్ధతో ఆలకించి విద్యపై దృష్టి సారించడం ద్వారా ఉన్నత స్దితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వనవాసీ నిలయ కమిటీ అద్యక్షులు తాటి పాపారావు, కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ, ఉపాధ్యక్షులు గోగికార్ రాంలక్ష్మణ్, సహకోశాదికారి వేములపల్లి ప్రవీణ్ బాబు, కమిటీ సభ్యులు శివరాజు కిషోర్, బుర్రా సత్యనారాయణ మూర్తి, లవన్ కుమార్ రెడ్డి, యాదాల సందీప్, నిలయ ప్రముఖ్ గొంది ప్రసన్నకుమారి పాల్గొన్నారు.

# గ్యారవి షరీఫ్ కవ్వాలి వేదికలో పాల్గొన్న రవి యాదవ్



నేహ్రూ నగర్‌లో జరిగిన గ్యారవి షరీఫ్ కవ్వాలి కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ బీఆర్ఎస్ యూత్ మాజీ వైస్ ప్రెసిడెంట్, శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మారబోయిన రవి యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

స్థానిక వాలీబాల్ టీమ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాత్మక ప్రదర్శనలు, కవ్వాలీ సంగీతం అందరినీ ఆకట్టుకున్నాయి. రవి యాదవ్ ని నిర్వాహకులు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మతపరమైన కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయి. యువత సాంప్రదాయాలతో అనుసంధానమవ్వాలి అని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో SK. గఫ్ఫార్, ఖాదర్ ఖాన్, SK. తాహెర్, చిన్న రెడ్డి, SK. అలీం, Md. సల్మాన్, మల్లేష్ ముదిరాజ్, గడ్డం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తాం

- **మన బస్తీ బాటలో రవి యాదవ్**

**సెరిలింగంపల్లి,అక్టోబర్ 12,(డిడి9 వార్త):**

ప్రజల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడమే మా లక్ష్యం. త్రాగు నీరు, డ్రెయినేజ్, రోడ్లు, దీపాలు, చెత్త నిర్వహణ — ప్రతి అంశంపైనా సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తూ తక్షణ చర్యలు తీసుకుంటామని శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, గ్రేటర్ హైదరాబాద్ బీఆర్ఎస్ యూత్ మాజీ వైస్ ప్రెసిడెంట్ శ్రీ మారబోయిన రవి యాదవ్ అన్నారు ఆదివారం మన బస్తీ బాట” కార్యక్రమం లో భాగంగా పాపిరెడ్డి కాలనీ 106వ డివిజన్ లో ప్రజల సమస్యలను వీధీవీధీ పాదయాత్ర ద్వారా పరిశీలించారు. ప్రజలు త్రాగు నీటి సరఫరా లోపం, డ్రెయినేజ్ పగుళ్లు, వీధిదీపాల కొరత, చెత్త సేకరణ లోపం వంటి ప్రధాన సమస్యలను వివరించారు. కార్యక్రమంలో మల్లేష్ ముదిరాజ్, గడ్డం శ్రీనివాస్, సాయి నందన్ ముదిరాజ్, పవన్, శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# బ్రిడ్జిపై నుంచి దూకి యువకుడు ఆత్మహత్యాయత్నం

- **గల్లంతు, గాలింపు చర్యలు ముమ్మరం**
- **పట్టణంలో విషాదం: వంతెన పైనుంచి నదిలోకి దూకిన యువకుడు**

**భద్రాచలం అక్టోబర్ 12 డిడి9 వార్త**

భద్రాచలం పట్టణంలో విషాద ఘటన చోటుచేసుకుంది. చర్ల రోడ్డులోని ఎల్ఐసి ఆఫీస్ సమీపంలో నివాసముంటున్న సాయి (25) అనే యువకుడు, బ్రిడ్జి వంతెన పైనుండి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. యువకుడు వంతెన పైనుంచి దూకడాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పట్టణ పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు.

గల్లంతైన సాయి ఆచూకీ కోసం పోలీసులు వెంటనే గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటనలో యువకుడు నదిలో గల్లంతయ్యాడు.నదిలో గాలింపును మరింత ముమ్మరం చేసేందుకు గజ ఈతగాళ్లను రప్పించి యువకుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సాయికి వివాహం అయినట్లు, అతనికి ఒక కూతురు ఉన్నట్లు తెలిసింది. ఆర్థిక సమస్యలు లేదా కుటుంబ కలహాలు వంటి ఏ కారణాలతో సాయి ఈ తీవ్ర నిర్ణయం తీసుకున్నారనేది ఇంకా తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి, ఆత్మహత్యాయత్నానికి దారితీసిన కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. సాయి ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

# ఇసుక లారీల బీభత్సంతో నరకం చూస్తున్న ప్రజలు

- **ప్రజల ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా....!**
- **సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు రావులపల్లి రవికుమార్**

**దుమ్ముగూడెం అక్టోబర్ 12 ( డిడి9 వార్త )**

మీతి మీరిన ఇసుక లారీలతో ఈ ప్రాంత ప్రజలు ప్రాణాలు పోతున్న పాలకులకు అధికారులకు ఏమి పట్టాదాని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు రావులపల్లి రవికుమార్ మండల కార్యదర్శి బొల్లోజు వేణులు విమర్శించారు. ఆదివారం నరసాపురం గ్రామ ప్రధాన రహదారిపై సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు అనంతరం వారు మాట్లాడుతూ

సాధారణంగా భద్రాచలం నుండి వెంకటాపురం వరకు నిత్యం వాహనాల పోకడ రద్దిగా ఉంటుందని ఈ మధ్య కాలంలో ఇసుక రవాణా వల్ల లారీలు బీభత్సంతో రోడ్లన్నీ పూర్తిగా ధ్వంసమయ్యాయి అని తెలిపారు. దీంతో భద్రాచలం వెంకటాపురం ప్రయాణం అంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రజలు వెళ్లేటువంటి పరిస్థితి నెలకొందని వారు తెలిపారు. ఇదే విషయంపై గత కొన్ని రోజులుగా రాజకీయ పార్టీలకతీతంగా ఇక్కడ జరుగుతున్న తీరుపై వ్యతిరేకిస్తున్నప్పటికీ జరుగుతున్న తీరుపట్ల ఎటువంటి మార్పు రావడంలేదని అన్నారు.అత్యవసర సమయంలో ఆసుపత్రి వైపు వెళ్లే వాహనాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నటువంటి సందర్భాలు ఉన్నాయని. రోడ్లన్నీ గుంతలుగా మారినప్పటికీ వాటిని సరి చేసే పరిస్థితి కనబడటం లేదని ఈ ప్రాంత ప్రజలు రోడ్డుపై ధర్నాలు చేసిన అధికారులకు కనికరం లేకుండా పోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కనీస అవసరాలకు భద్రాచలం వెళ్లాలంటే గతంలో రోడ్డుపై ప్రశాంతంగా వెళ్లేటువంటి ఉన్నాయని అటువంటి పరిస్థితి నుండి ప్రస్తుతం ఈ మార్గం గుండా



ప్రయాణం అంటే ప్రజలు ప్రాణభయంతో భీకరిళ్ళే స్థితికి వచ్చారని అన్నారు

చిన్నపాటి వర్షానికే నిత్యం వందలాదిగా వస్తున్న లారీలతో చిన్నపాటి వర్షం పడితే చాలు రోడ్లన్నీ కిలోమీటర్ల వారు రవాణా అంతరాయం కలుగుతుందని తద్వారా ప్రజలు సకాలంలో వె ల్లవలసిన గమ్యానికి చేరుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇసుక లారీల అతి వేగానికి ఈ ప్రాంతం గుండా వెళ్లే వాహనదారులకు ప్రమాదాలు గురై ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటన కూడా అధికంగా ఉన్నాయని గుర్తు చేశారు

**- నరకయాకున పడుతున్న ప్రజలు**

ఈ ప్రాంతంలో గత రెండు సంవత్సరాలుగా ఇసుక లారీల బీభత్సానికి ప్రతిరోజు ప్రజలు నరకయాతన పడుతున్నారని రోడ్లన్నీ అస్తవ్యస్తంగా మారడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లేటువంటి స్థితి ఇక్కడ నెలకొందనిదీనిపై ఉన్నతాధికారులు స్పందించాల్సినటువంటి పరిస్థితులు ఉన్నప్పటికీ ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం దీనిపై ప్రత్యేకంగా దుష్టసాధిస్తే ఈ మార్గం గుండా వెళ్ళేటటువంటిది వాహనాల రద్దీని తగ్గించి ప్రజల ప్రాణాలు కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈ సందర్భంగా తెలిపారు . ఇలానే సాగితే ఈ ప్రాంతంలో ప్రజల ఆరోగ్యాలతో పాటు ప్రాణాలు కూడా పోయేటువంటి స్థితి ఎంతైనా ఉందని వారు తెలిపారు.

**- వాహనాలు రాకుండా చూస్తాం- సీఐ వెంకటప్పయ్య**

నరసాపురం గ్రామంలో జరుగుతున్న ధర్నాకి వద్దకి సీఐ వెంకటప్పయ్య చేరుకుని ఇకపై ఈ మార్గం గుండా వాహనాల రద్దీ తగ్గించేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఈ మార్గం గుండా రాకుండా ఆపే ప్రయత్నం చేస్తానని హామీ ఇవ్వడంతో ధర్నాని విరమించారు

ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శులు తాటిపూడి రమేష్, కాకా వెంకటేశ్వరరావు, సొసైటీ డైరెక్టర్ కిలిమి ఎల్లారెడ్డి, చప్పిడి రాంచంద్రర్ రావు అమరావది శంకర్, చెంచల కృష్ణ, మడకం ముత్తయ్య, దేగల బజారు, పొడియం మణి, ఐనబోయిన శేఖర్, తామ చిన మత్తయ్య బొమ్మిడి దుర్గ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు



## భద్రాచలం చర్ల ప్రధాన రహదారి దిగ్బంధం

- **తక్షణ మరమ్మత్తులు చేపట్టాలి, ఇసుక లారీలను నిలిపివేయాలి- బీఆర్ఎస్ డిమాండ్**

**దుమ్ముగూడెం , అక్టోబర్ 12 (డిడి 9 వార్త )**

ఇసుక లారీల రవాణా వలన భద్రాచలం నుండి చర్ల వరకు ఉన్న ప్రధాన రహదారి అధ్వాన్నంగా మారడంతో ప్రయాణికులు పడుతున్న అవస్థలు నిరసనగా సోమవారం బీఆర్ఎస్ పార్టీ దుమ్ముగూడెం మండల కమిటీ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుండి తూరుబాక బ్రిడ్జి వద్ద ప్రధాన రహదారిని దిగ్బంధం కార్యక్రమం తలపెట్టంని తెలిపారు. తక్షణమే రోడ్డు మరమ్మత్తులు చేపట్టాలని, పనులు పూర్తి అయ్యేంత వరకు ఇసుక లారీలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ధర్నా , దిగ్బంధం కార్యక్రమం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్యకర్తలు , ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. రోడ్డుపై గుంతల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక లారీల అతివేగం, అధిక లోడ్ కారణంగానే రోడ్డు మరింత దెబ్బతింటున్నదని ఆరోపించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ... ప్రయాణికులు, ప్రజల మేలు కోసమే ఈ పోరాటం చేపడుతున్నామని, సమస్య పరిష్కారం అయ్యేంత వరకు తమ ఆందోళన కొనసాగుతుందని హెచ్చరించారు. దిగ్బంధం కారణంగా సోమవారం ఉదయం 10 గంటల నుండి భద్రాచలం వైపు వెళ్ళే ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించుకోవాల్సిందిగా బీఆర్ఎస్ కమిటీ ప్రజలను కోరింది. ప్రజల ఇబ్బందులను గుర్తించి అధికారులు తక్షణమే స్పందించాలని వారు డిమాండ్ చేశారు.

## మితిమీరిన ఇసుక రవాణాతో చర్లభద్రాచలం రహదారి ధ్వంసం

- **అధికారుల నిర్లక్ష్యాన్ని ఖండించిన సిపిఎంఎల్ మాస్ లైన్ పార్టీ**

**భద్రాచలం అక్టోబర్ 12 డిడి9 వార్త**

చర్ల మండలం నుంచి భద్రాచలం వరకు రహదారి భారీ లారీల ఇసుక రవాణాతో పూర్తిగా దెబ్బతిందని సిపిఎంఎల్ మాస్ లైన్ పార్టీ ఆరోపించింది. భద్రాచలం సిపిఎంఎల్ మాస్ లైన్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పార్టీ నాయకుడు కేచెల రంగా రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఇసుక అవసరాల పేరిట అధిక ఆదాయం కోసం చట్ట విరుద్ధంగా మితిమీరిన ఇసుక తవ్వకాలు, రవాణా జరుగుతున్నా ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు.రంగారెడ్డి మాట్లాడుతూ, సీతమ్మసాగర్ ప్రాజెక్టు పనులు




ఆగిపోయినప్పటికీ డీసెల్టేషన్ పేరిట టీజీఎండిసీ అధికారులు స్వేచ్ఛగా అనుమతులు ఇచ్చి చర్ల మండలంలో కుదునూరు నుండి సుబ్బంపేట వరకు ఆరు ర్యాంపులు నడిపిస్తున్నారని తెలిపారు. వీటిలో ఆంధ్ర, తెలంగాణ కాంట్రాక్టర్లు 6 నుండి 10 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక తవ్వకాలు చేపడుతున్నారని, వందల సంఖ్యలో లారీలు మితిమీరిన లోడుతో రాత్రింబగళ్లు రవాణా చేయడం వలన రహదారి పూర్తిగా విధ్వంసం అయిందని తెలిపారు.దీంతో ప్రయాణికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వర్ష కాలంలో ప్రమాదాలు పెరిగి అనేక ప్రాణనష్టాలు చోటుచేసుకుంటున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పంటలు దుమ్ము దూళితో నష్టపోతుండగా గ్రామ దుకాణదారులు వ్యాపారం చేయలేకపోతున్నారని చెప్పారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఇలాంటి అక్రమ ఇసుక తవ్వకాలు చట్ట విరుద్ధమని, ప్రతిఘటించే ప్రజలపై కాంట్రాక్టర్లు దాడులు కూడా చేస్తున్నారని రేగరెడ్డి తీవ్రంగా ఖండించారు. కొటేరు శ్రీనివాసరెడ్డి అలియాస్ శ్రీకర్ వంటి కాంట్రాక్టర్లు అక్రమ సంపాదనలో నిమగ్నమై ఉన్నారని, వీరిపై సిబిసిఐడి విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అక్రమ రవాణాలు, రోడ్ల విధ్వంసం అరికట్టేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని, రహదారి పునర్నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించి కాంట్రాక్టుల ద్వారా పనులు జరపాలని సూచించారు.లేకపోతే ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజల ఆగ్రహానికి గురవుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కల్పన, డివిజన్ కమిటీ సభ్యులు దాసరి సాయి, మునిగేలా శివప్రశాంత్ పాల్గొన్నారు.

## ఇసుక లారీలు నిలిపివేయాలని సీతారాంపురం లో ఆందోళన

- **అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా**
- **రోడ్లు మరమ్మత్తులు చెయ్యాలని డిమాండ్**
- **నిలిచిపోయిన వాహనాలు**
- **దారిపొడుగూత లారీలు**
- **గంటపాటు ట్రాఫిక్ జామ్**

**దుమ్ముగూడెం,అక్టోబర్ 12,(డిడి9 వార్త):**

ఇసుక లారీల వలన రోడ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయని వాటికి మరమ్మత్తులు చెయ్యాలని అలాగే ఇసుక లారీలను నిలిపివేయాలని ఆదివారం అఖిలపక్షం ఆధ్వర్యంలో రోడ్డు పై బైఠాయించిన సంఘటన సీతారాంపురం లో చోటుచేసుకుంది వివరాల్లోకి వెలితే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం సీతారాంపురం గ్రామంలో ఇసుక లారీల కారణంగా రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ పరిస్థితిని నిరసిస్తూ గ్రామస్థులు అఖిలపక్షం ఆధ్వర్యంలో రోడ్డుపైకి దిగారు. గ్రామంలోని ప్రధాన రహదారి తీవ్రంగా అధ్వానంగా మారి, సాధారణ వాహనదారులు మాత్రమే కాకుండా అత్యవసర సేవలకు కూడా తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పేషెంట్లను భద్రాచలం తరలించే సమయంలో రోడ్డు పరిస్థితి కారణంగా ప్రాణాపాయం ఏర్పడే పరిస్థితులు నెలకొన్నాయని గ్రామస్థులు పేర్కొన్నారు. గుంతల వల్ల వాహనాలు తరచూ దెబ్బతింటున్నాయని, ట్రాఫిక్‌కు అంతరాయం



జరుగుతోందని తెలిపారు. అధిక లోడుతో వెళ్తున్న ఇసుక లారీలను వెంటనే నియంత్రించాలని, ధ్వంసమైన రోడ్లను అత్యవసరంగా మరమ్మతు చేయాలని మాజీ జెడ్పీటీసీ అన్నే సత్యనారాయణమూర్ డిమాండ్ చేసారు,గ్రామస్థుల ఆందోళనతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ పూర్తిగా స్థంభించిపోయింది.ఈ కార్యక్రమంలో బుల్లోజ్



పవన్ కుమార్, ఆలా వెంకటకృష్ణ, అజీమ్, వినోద్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.







# ముగిసిన వెంకటాపురం ప్రీమియర్ లీగ్ సీజన్ 02

- **హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్..**
- **విజయం సాధించిన హంటర్ లెవెన్ టీమ్..**
- **రెండవ స్థానంలో మహాలక్ష్మి వారియర్స్ టీమ్.**
- **ముఖ్య అతిథిగా విచ్చేసి గెలుపొందిన వారికి బహుమతులు అందజేసిన స్థానిక సీఐ ముత్యం రమేష్, స్థానిక ఎస్సై కొప్పుల తిరుపతిరావు .**

**అక్టోబర్ 12 డిడి9 వార్త. వెంకటాపురం (నూగురు).**

సే నో డ్రగ్స్ మోటో తో ప్రారంభమైన వెంకటాపురం ప్రీమియర్ లీగ్ సీజన్ 2 ఆదివారంతో ముగిసినది. హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్ ముందుగా టాస్ గెలిచి మహాలక్ష్మి వారియర్స్ ని బ్యాటింగ్ కి ఆహ్వానించిన హంటర్ వారియర్స్. నిర్ణీత 15 ఓవర్ల మ్యాచ్ లో మొదటగా మహాలక్ష్మి వారియర్స్ 107 పరుగులు చేసి, 108 పరుగుల విజయ లక్ష్యాన్ని హంటర్ వారియర్స్ ముందు ఉంచినది. రెండవ బ్యాటింగ్ కి వచ్చిన హంటర్ వారియర్స్ మహాలక్ష్మి వారి ఉంచిన 107 పరుగుల లక్ష్యాన్ని 5 ఓవర్లు మిగిలి ఉండగానే మూడు వికెట్లు కోల్పోయి సునాశయంగా 108 పరుగులు చేసి గెలుపొందడం జరిగింది.

ఈ మ్యాచ్ కి ముఖ్యఅతిథిగా చేసిన స్థానిక సీఐ ముత్యం రమేష్ ఈ విధంగా మాట్లాడుతూ... క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలగజేస్తాయని అదేవిధంగా శరీర దారుధ్యాన్ని పెంపొందిస్తాయని, మోటో సే నో డ్రగ్స్ పేరుతో ఈ ఆటల పోటీలు నిర్వహించడం ఎంతో అభినందనీయం అని ఆటలో గెలుపోటములు సహజమని ఓడిన వారు మరింత పట్టుదలతో వచ్చే పోటీల్లో రాణించాలని, గెలుపొందిన వారికి తన అభినందనలు తెలిపారు..



తరువాత గెలుపొందిన, హంటర్ వారియర్స్ వారికి కమిటీ ఆధ్వర్యం లో మొదటి బహుమతి 55555 రూపాయలు కీర్తిశేషులు బాలసాని ముత్తయ్య గారి జ్ఞాపకార్థం వారి కుమారులు బాలసాని వేణుగోపాల్, అశ్వపతి, రవి అందజేయడం జరిగినది. పోటీలో రెండవ స్థానం లో నిలిచిన మహాలక్ష్మి వారియర్స్ టీంకు రెండవ బహుమతి 33333 రూపాయలు కీర్తిశేషులు గొడవర్తి శ్రీమన్నారాయణ గారి జ్ఞాపకార్థం వారి కుమారుడు గుడవర్తి నరసింహమూర్తి అందజేయడం జరిగినది.

మూడవ బహుమతిగా 22222 రూపాయలను పీర్ల కృష్ణ బాబు , అగ్రోస్ త్రినాథ్ టీచర్స్ లెవెన్ కి అందజేయడం జరిగింది. నాలుగో బహుమతిగా 11111 రూపాయలను దర్రా దామోదర్, చిట్టెం శ్రీనివాస్ చేయూత లెవెన్ టీం కి అందజేయడం జరిగినది.

వెంకటాపురం ప్రీమియర్ లీగ్ సీజన్ 02 బెస్ట్ బ్యాట్స్మెన్ గా 210 సాధించిన టీచర్స్ 11 టీం సభ్యుడు వెంకీకి అవార్డు ఇవ్వడం జరిగింది.

బెస్ట్ బౌలర్ సీజన్ 02 గా మహాలక్ష్మి వారియర్స్ టీం సభ్యుడు పూజ రమేష్ కు , సీజన్ 02 బెస్ట్ కీపర్ గా టీచర్స్ 11 సభ్యుడు వెంకీకి, బెస్ట్ క్యాచ్ ఆఫ్ ద సీజన్ 02 వంశీకి, బెస్ట్ ఫీల్డర్అవార్డ్, టెక్నికల్ టీం సభ్యుడు చింటూ కి. ఫెయిర్ ప్లే అవార్డుటీచర్స్ 11 టీం కి ఇవ్వడం జరిగినది. అదేవిధంగా క్రీడాకారులకు ఉపయోగంగా ఉండే శాశ్వత క్రీడా వేదికను నాలుగు లక్షల రూపాయల తమ సొంత నిధులతో నిర్మించిన శ్రీమతి శ్రీ లక్ష్మి, బేతంచెర్ల వెంకటేశ్వరరావు గారిని సన్మానించడం జరిగినది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాల్వ సుందర్రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, పిఏసిఎస్ చైర్మన్ చిడం మోహన్ రావు, ములుగు జిల్లా టాస్ ఉల్లాస్ చైర్మన్ పీర్ల కృష్ణ బాబు, బి ఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప రాంబాబు, బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు గుడవర్తి నరసింహమూర్తి, ధరా దామోదర్, ముడుంబా శ్రీనివాస్, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.















# ఖాకీల కలెక్షన్ల వేట

## ఏసీబీ దృష్టిలో ఇద్దరు కానిస్టేబుళ్లు



- బాధితులు ఏసీబీ బాట
- ప్రస్తుతం వారు ఎక్కడున్నారో తెలియదు

### అవినీతికి కేరాఫ్ అడ్రస్ మణుగూరు పోలీస్ స్టేషన్

- తారస్థాయిలో వసూళ్ల దందా
- ఇప్పటికే ఏసీబీకి చిక్కిన పోలీసులు
- అయినా మారని అక్రమార్కులు
- రక్షణ శాఖలో అవినీతి రాక్షసులు
- ప్రక్షాళన చేయకుంటే పరువు పోయే పరిస్థితులు







**డిడి 9 వార్త బ్యూరో భద్రాద్రి కొత్తగూడెం:** మణుగూరు పోలీస్ స్టేషన్ లో అవినీతి తంతు అంతులేని స్థాయికి చేరిపోతుంది. పోలీస్ శాఖకు తలవొంపులు తెచ్చేలా కొందరు అవినీతి పోలీసులు వ్యవహరిస్తున్న దందా కారణంగా ఇప్పటికే ఈ స్టేషన్ ఏసీ బీ లిస్టులో చేరిపోయింది. లంచాలు తీసుకొని ఏసీబీకి చిక్కిన సంఘటనలు ఇక్కడ చోటు చేసుకున్నప్పటికీ ఇంకా కొందరు పోలీసుల్లో మార్పు రాలేదు . యధావిధిగా తమ కలెక్షన్ల వేటను కొనసాగిస్తున్న పరిస్థితి నెలకొంది. న్యాయం కోసం వెళ్లే బాధితులు స్టేషన్లో న్యాయం పొందకపోగా ఆర్థిక దోపిడీకి గురవుతున్నా రు కలెక్షన్లే లక్ష్యంగా పోలీస్ శాఖ నడుస్తున్న పరిస్థితి ఉండడంతో నిజాయితీపరులైన పోలీసులు ఆవేదన వ్యక్తం చేయాల్సి వస్తుంది. ఇటీవల కాలంలో మణు గూరు పోలీస్ స్టేషన్ వార్తల్లోకెక్కుతుంది. ఈ స్టేషన్లో అవినీతి పనులు కొందరు ఏసీబీ వలన చిక్కిన సందర్భాలు ఉన్నాయి. అవినీతికి పరాకాష్టగా పేరెన్నికగాంచిన మణుగూరు స్టేషన్లో ఇటీవల కాలంలో చోటు చేసుకున్న పలు పరిణామాలు ఆ శాఖ అనైతికతను ప్రస్ఫుటం చేస్తున్నాయి. ఫిర్యాదు వస్తే చాలు పైసల కోసం చేతులు సాపే వ్యవహారాలు ఇక్కడ పరిపాటిగా మారిపోయాయి. ఈ క్రమంలోనే ఓ సి ఐ, ఎస్ ఐ ఇప్పటికే ఏసీబీ వాళ్లకు చిక్కిన పరిస్థితి ఇక్కడ నెలకొన్న అవినీతికి సాక్షాలుగా నిలిచాయి అయినా సరే కొందరు ప్రబుద్ధులు కలెక్షన్ నైజాన్ని మాత్రం మర్చిపోవడం లేదు తాజాగా మణుగూరు పోలీస్ కి సంబంధించిన ఇద్దరు కానిస్టేబుల్ గురించి సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం ఈ స్టేషన్లో చేయాల్సిన ప్రక్షాళన చర్యలను గుర్తు చేస్తున్నాయి


### న్యాయం కోసం ఏసీబీకి ఫిర్యాదు

సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారనే పేరుతో అధికార పార్టీ నేతల ఫిర్యాదు, ఒత్తిడి మేరకు పోలీసు లు ఓ వ్యక్తిపై కేసు నమోదు చేశారు . కోర్టులో హాజరు పరిచారు. ఈ క్రమంలోనే ఆ వ్యక్తి వద్ద నుండి భోజనం డబ్బులు డిమాండ్ చేశారు. వారు చేసిన ఒత్తిడి మేరకు ఫోన్పే ద్వారా రూ. 3000, నగదు రూపంలో రూ.2000

### ప్రతి డీల్ స్టేషన్ లోనే..

మణుగూరు పోలీస్ స్టేషన్లో జరుగుతున్న ప్రతి అవినీతి తంతు ప్రజల్లో అభద్రతాభావానికి కారణం అవుతుంది. సాధారణ ఫిర్యాదులు మొదలుకొని సివిల్ సెటిల్మెంట్లు బెయిల్ డీలింగ్స్ పేరుతో జరుగుతున్న లావాదేవీల వెనుక భారీగా కలెక్షన్ వేట ఉంటుందని ఆరోపణలు ఉన్నాయి. సెటిల్మెంట్లకు కేంద్రంగా మారిన ఆ స్టేషన్లో ఇక ప్రజలకు ఏం న్యాయం జరుగుతుందని భావన వచ్చేసింది. ఏసీబీ దాడుల్లో తమ శాఖ ఉద్యోగులు చిక్కుకొని పరువు తీస్తున్నప్పటికీ ప్రక్షాళన చర్యలు మాత్రం సంబంధిత ఉన్నతాధికారులు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తుంది ఇదే సమయంలో జిల్లా స్థాయి అధికారుల అజమాయిషి లోపాన్ని తమకు అనుకూలంగా మార్చుకున్న పోలీసులు తమ మామూళ్ల దందాను ఆపేదే లేదంటూ భీష్మించుకుని కూర్చున్నారు. ఈ నేపథ్యంలోనే పోలీసు తీరుపై రగిలిపోతున్న ఓ బాధితుడు నేరుగా ఏసీబీకి ఇద్దరు కానిస్టేబుల్ వసూళ్ల దందాపై ఫిర్యాదు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంలో ఏసీబీ అధికారులు నాన్చివేత ధోరణితో వ్యవహరిస్తుండడం పట్ల నిరసన వ్యక్తం చేసిన బాధితుడు విషయాన్ని పాత్రికేయుల వద్దకు తీసుకొచ్చాడు. దీంతో మణుగూరు పోలీస్ స్టేషన్ లో ఉన్న మరో ఇద్దరు అవినీతిపరులైన ఆణిముత్యాల వ్యవహారాలు వెలుగులోకి వచ్చాయి

బాధితుడు అందజేశాడు అనంతరం జైలు నుండి వచ్చాక తనకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ తనను అకారణంగా కొట్టారని డబ్బులు డిమాండ్ చేశారని ఆగస్టు 28న ఏసీబీకి ఫిర్యాదు చేసినట్లు సోషల్ మీడియా ద్వారా బాధితుడు వెలుగులోకి తెచ్చాడు. ఫిర్యాదు ఇచ్చి చాలా కాలం అవడంతో బాధితులు తనకు న్యాయం జరగలేదని ఏసీబీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తూ తనకు న్యాయం చేయాలంటూ ఎసిబికి ఫిర్యాదు చేసిన ఫిర్యాదు ప్రతులను పాత్రికేయులకు అందజేశారు. బాధితుడు ఇద్దరు కానిస్టేబుల్ పై ఈ ఫిర్యాదు చేయడం జరిగింది. అయితే ఆ ఇద్దరి కానిస్టేబుల్స్ ఎక్కడ వారిపై చర్యలు తీసుకునే విషయంలో జరుగుతున్న జాప్యం వెనక కారణాలపై అనుమాన వ్యక్తం చేస్తూ బాధితుడు న్యాయం కోసం విలేకరులను ఆశ్రయించాడు. దీంతో మణుగూరు పోలీస్ స్టేషన్లో మరో అవినీతి తంతు వెలుగు చూసింది. దీనిపై ఏసీబీ అధికారులు ఇటు పోలీసు ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.





### జిల్లా ఎస్పీ స్పందించాలి

మణుగూరు పోలీస్ స్టేషన్ లో జరుగుతున్న అనైతిక కార్యకలాపాలపై జిల్లా ఎస్పీ దృష్టిసారించి ప్రక్షాళన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది తాజాగా పోలీస్ స్టేషన్లోనే సిఐ సమక్షంలో ఓ వ్యక్తిపై ఇసుక బినామీ చేసిన దాడి సంఘటన ఆ శాఖ పరువుకు భంగం వాటిల్లే లా చేసింది. అయినా సరే దీనికి సంబంధించి పోలీస్ శాఖ నుండి ఎలాంటి స్పందన రాలేదు. సీఐ సాక్షిగా రైతుని ఇసుక బినామీ చిత్తక్కోట్టడంపై సర్వత్ర విమర్శలు వ్యక్తమవుతున్న సిఐపై చర్యలు తీసుకోక పోవడం పట్ల అనుమానాలు కలిగిస్తున్నాయి. ఇదే సమయంలో మణుగూరు పోలీస్ స్టేషన్ లోని ఇద్దరు కానిస్టేబుల్ పై ఓ వ్యక్తి ఏసీబీకి ఫిర్యాదు చేయడం తీవ్ర చర్చకు దారి తీస్తోంది ఇలాంటి పరిస్థితుల్లో మణుగూరు పోలీస్ స్టేషన్లో పూర్తిస్థాయి ప్రక్షాళన చర్యలకు శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఉంది దీర్ఘకాలికంగా అదే స్టేషన్ లో ఉంటున్న వారిని అక్కడి నుండి పంపించి అనైతిక కార్యకలాపాలకు చెక్ పెట్టాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.